38 రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయనగరం డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 38 రేషన్ డిపో డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆర్డీవో దాట్ల కీర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. జనవరి 5వ తేదీ ఉదయం 11 గంటలకు విజయనగరం ఎంఆర్ కాలేజీలో రాత పరీక్ష ఉంటుందని తెలిపారు.

హెల్మెట్ ధరించండి

- ప్రమాదాల నుంచి బయటపడండి

- జిల్లాలో సక్రమంగా అమలుకాని నిబంధన
- చలానాలతో సరిపెడుతున్న పోలీసులు
- ప్రమాదాలతో పెరుగుతున్న మరణాలు




జిల్లాలో రోడ్డు ప్రమాదాల మరణాలు

సంవత్సరం	మరణాలు
2022	15
2023	21
2024 (నవంబరు 30)	14

- ఈ ఏడాది సెప్టెంబరు 4న భోగాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గడే కనకరాజు (40) అనే డాక్యుమెంట్ రైటర్ మృతి చెందాడు. కనకరాజు విధులు ముగించుకుని భోగాపురం నుంచి సమీపంలోని నందిగాం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొంది. ఆయన హెల్మెట్ ధరించకపోవడంతో తల రోడ్డును బలంగా తాకడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎటువంటి ఆస్తిపాస్తులు కూడా లేవు. ఆయన మృతితో ఈ కుటుంబం అనాథగా మిగిలింది. కనకరాజు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడేవాడని పోలీసులు చెప్పారు.

- ఈ ఏడాది జూలై 2న విజయనగరం మండలం అయ్యన్నపేటకు చెందిన గంట్యాడ నారాయణమూర్తి (37) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జొన్నవలస పెట్రోలు బంకులో పనిచేస్తున్న ఈయన మీదే కుటుంబం ఆధారపడి ఉంది. తల్లి సరోజినితో కలసి మెంటాడ మండలం చల్లపేటలో జరిగిన శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా, నెలివాడ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నారాయణమూర్తి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. తల్లి సరోజిని కూడా గాయపడింది. నారాయణమూర్తి హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు దక్కేవి.



విజయనగరం (క్రైం), డిసెంబరు 16: (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్న నిబంధన జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదు. కొన్ని సందర్భాల్లో పోలీసులు కేసులు రాసి, జరిమానా వేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది ఈ అపరాధ రుసుం కూడా చెల్లించడం లేదు. హెల్మెట్ వినియోగించాలన్న నిబంధనను కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత పోలీసు, రవాణాశాఖపై ఉంది. అంతకుమించి ప్రాణ రక్షణ కోసం వాహనదారులు కూడా హెల్మెట్ ధరించాల్సి ఉంది. అయితే, కొందరు ద్విచక్ర వాహనచోదకులు ప్రతిరోజూ హెల్మెట్ వాడితే తల వెంట్రుకలు రాలిపోతాయని, తల వేడికి గురౌతుందని శిరస్త్రాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. నేటి యువత వేగానికిచ్చిన విలువ ప్రాణాలకు, హెల్మెట్ ధరించేందుకు ఇవ్వడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడే పోలీసు, రవాణాశాఖ అధికారులు అప్రమత్తమై కొన్ని రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, చలానాలు రాయడం, అవగాహన సదస్సులు నిర్వహించడం చేస్తున్నారు. తరువాత పట్టించుకోవడం లేదు. గత నాలుగు నెలల్లో పోలీసులు 57,728 ఈ-చలానా కేసులు నమోదు చేసి రూ.57,72,800 అపరాధ రుసుం విధించారు. రవాణాశాఖ 2022 సంవత్సరంలో కేవలం 23, 2023లో 29, 2024లో ఇప్పటి వరకు 20 కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. హెల్మెట్ నిబంధన అమలు కాకపోవడంపై ఇటీవల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కచ్చితంగా నిబంధనలు అమలు చేయాలని ఆదేశించింది. ఇప్పటికైనా హెల్మెట్‌ను వినియోగించని వారిపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి



ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఈ నిబంధన జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో అమలు చేస్తాం. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేస్తాం. తొలుత అవగాహన కల్పిస్తాం. అనంతరం పట్టుబడితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం. రోడ్డు ప్రమాదాలను నియంత్రించే కార్యక్రమంలో భాగంగా ఎవరినీ ఉపేక్షించేదీ లేదు. వాహన నిబంధనలను కఠినంగా అమలు చేస్తాం.

- వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

అతిక్రమిస్తే కఠిన చర్యలు



జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. తొలుత అవగాహన కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తాం. అయినా ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా కృషి చేస్తాం.

-మణికుమార్, రవాణాశాఖ ఉపకమిషనర్

మంచంపట్టిన గెడ్డవలస

- వైరల్ ఫీవర్, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న గ్రామస్థులు
- ఇంటి వద్దే చికిత్స పొందుతున్న వైనం
- కన్నెత్తి చూడని వైద్యాధికారులు
- పెరుగుతున్న బాధితుల సంఖ్య



గెడ్డవలసలో బాధితులు

రాజాం డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డవలస గ్రామస్థులు తెలియని వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల, కీళ్ల నొప్పులు, వైరల్ ఫీవర్‌తో మంచం పట్టారు. 25 రోజుల కిందట ముగ్గురిలో ఈ లక్షణాలు కనిపించాయి. ఇప్పుడు బాధితుల సంఖ్య 30కి చేరింది. గ్రామంలో ఎక్కువ శాతం మంది వ్యవసాయ ఆధారిత కుటుంబాలు కావడంతో వారు పొలం పనులకు వెళ్లలేక, సరైన వైద్యం చేసుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అవకాశం ఉన్న వారు రాజాంలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చేరగా, మిగిలిన వారు ఇంటి వద్దే ఆర్‌ఎంపీల ద్వారా చికిత్స చేయించుకుంటున్నారు. బొద్దాం పీహెచ్‌సీ వైద్యులు గాని, ఆరోగ్య కార్యకర్తలు గాని తమ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. జ్వరం తగ్గినా కాళ్లు, చేతులు వాపు ఉంటుందని, ముడుకులు, ఒళ్లు నొప్పులు భరించలేక పోతున్నామని చెబుతున్నారు. కనీసం నడవలేకపోతున్నామని వాపోతున్నారు. తాగునీటి వలనే ఈ పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించి సరైన వైద్య పరీక్షలు అందించాలని, ఈ వ్యాధి రావడానికి ప్రధాన కారణం ఏమిటో నిర్ధారణ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు

ధనుర్మాసోత్సవాలు ఆరంభం

- ఆలయాల్లో పూజలు
- గ్రామాల్లో మేలుకొలుపులు
- గోదాదేవి అమ్మవారికి ప్రీతికరం

6లో



బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- ఎస్పీ వకుల్ జిందాల్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 38 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 38 ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భూ తగాదాలకు సంబంధించి 14, కుటుంబ కలహాలపై 4, మోసాలపై 8, ఇతర సమస్యలపై 12 ఫిర్యాదులు ఉన్నాయి. సమస్యలపై సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏడు రోజుల్లో సమస్యలు పరిష్కరించి, తీసుకున్న చర్యలను వెంటనే జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, సీఐ శంకరరావు, ఎస్ఐ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు..

పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట ఏదీ?

- యథేచ్ఛగా కబేళాలకు తరలింపు
- రవాణాలో నిబంధనలకు తూచ్!
- అందుబాటులో లేని గోశాలలు
- పట్టుబడిన పశువులను తిరిగి నిందితులకే అప్పగిస్తున్న వైనం

బొబ్బిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు వివిధ సంతల్లో వాటిని కొనుగోలు చేసి వాహనాల్లో కబేళాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ప్రతి గురు, శుక్రవారాల్లో తెల్లవారుజామున పార్వతీపురం, ఒడిశా, సాలూరు తదితర ప్రాంతాల నుంచి జాతీయ రహదారిలో పెద్దఎత్తున పశు అక్రమ రవాణా జరుగుతుంది. అలాగే, బొబ్బిలి నుంచి విజయనగరం వరకు హైవే మీదుగా పశువులను కంటైనర్లలో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అయినా రవాణాను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు. అన్ని చోట్లా సచివాలయాల సిబ్బంది రాత్రి పగలు నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని ఆర్డీవో లిఖితపూర్వక ఆదేశాలు జారీచేశారు. అక్రమ రవాణాకు సంబంధించి వారానికి కనీసం నాలుగు కేసులైనా నమోదు చేయాలని ఆదేశాలిచ్చినప్పటికీ ఎక్కడా అలా జరగడం లేదు. ఇప్పటికైనా పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరముంది.

- బొబ్బిలి పట్టణంలో రెండేళ్ల కిందట పశువుల వ్యాన్ ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ ఘటనతో పశువుల అక్రమ రవాణా వెలుగుచూసింది. చిన్న వాహనంలో 14 పశువులను కుక్కి రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ పశువులను గోశాలకు తరలించాలన్న నిబంధన ఉంది. కానీ, గోశాలలు అందుబాటులో లేకపోవడంతో సంరక్షణ కోసం ఆ 14 ఆవులను పశువైద్యుని సమక్షంలో నిందితులకే పోలీసులు అప్పగించారు. వాటిని కోర్టుకు అప్పగించాలన్నప్పుడు తీసుకురావాల్సి ఉంటుందని పోలీసులు పూచీకత్తు రాయించారు.
- దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో ప్రతీ శుక్రవారం పశువుల సంత జరుగుతుంది. ఈ సంతలో ప్రతివారం 8 వేల వరకూ మూగజీవాల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అయితే ఇందులో ఎక్కువ పశువులు ఇతర రాష్ట్రాల్లోని కబేళాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమ రవాణాను ఆర్డీవో నేతృత్వంలోని సంతల మానటరింగ్ కమిటీ అడ్డుకోవాల్సి ఉంది. కానీ, పెదమానాపురం సంత యాజమాన్యంతో సంతల మానటరింగ్ కమిటీ కుమ్మక్కై అక్రమంగా లైసెన్సు మంజూరు చేసినట్లు ఉన్నతాధికారులు గతంలో గుర్తించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నేరుగా సీఎంవోకు నివేదిక పంపించారు. దీనిపై ఎటువంటి చర్యలు లేవు.

కానరాని నిబంధనలు..

- గోశాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలన్న నిబంధన ఉంది. కానీ, జిల్లాలో స్థలం కేటాయించడం లేదు. గోశాల లేకపోవడంతో పోలీసులు పట్టుకున్న పశువులను తిరిగి నిందితులకే అప్పగించాల్సి వస్తోంది.
- పశువుల తరలింపు, రవాణాకు అనుమతిపత్రాలు తప్పనిసరి. సుదూర ప్రాంతాలకు వ్యవసాయ పనుల నిమిత్తం, పాడి అవసరాలకు తరలిస్తున్నామని ధ్రువీకరిస్తూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ, వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై పశువుల అక్రమ రవాణాకు లైసెన్సు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- రవాణా విషయంలో కనీస స్థాయిలో కూడా నిబంధనలు పాటించడం లేదు. ఒకే వాహనంలో 40 నుంచి 50 పశువులను కుక్కి తరలిస్తున్నారు. దారిపొడవునా కనీసం వాటికి ఆహారం వేయడం లేదు. దీంతో మార్గ మధ్యలో మృత్యువాతపడుతున్నాయి.



బొబ్బిలిలో పట్టుబడిన పశువుల వ్యాన్ (ఫైల్)

చేదెక్కిన చెరకు

- జిల్లాలో తగ్గిన పంట విస్తీర్ణం
- సాగుపై రైతుల అనాసక్తి
- వైసీపీ సర్కారు నిర్లక్ష్యమే కారణం
- మూతపడిన చక్కెర పరిశ్రమలు
- ప్రోత్సాహం కరువు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

జిల్లాలో చెరకు సాగు క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. ఏడాదికేడాది విస్తీర్ణం పడిపోతుంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చెరకు రైతులను నిర్లక్ష్యం చేసింది. పంటకు మద్దతు ధర ప్రకటించలేదు. మరోపక్క జిల్లాలో షుగర్ ఫ్యాక్టరీల మూసివేతతో పంటను విక్రయించుకోవడానికి రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో చాలామంది చెరకు సాగును తగ్గించుకొని..ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టారు. ఫలితంగా జిల్లాలో చెరకు సాగు గణనీయంగా తగ్గింది.

రాజాం, డిసెంబరు 16: జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 15 మండలాల్లో చెరకును విస్తారంగా పండించేవారు. తోటపల్లి, మడ్డువలస, తాటిపూడితో పాటు సాగునీటి వనరులున్న ప్రాంతాల్లో చెరకు సాగు చేసేవారు. పంటను షుగర్ ఫ్యాక్టరీలకు తరలించేవారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేవారు. కానీ, గత వైసీపీ పాలనలో సాగునీటి వనరులు పూర్తిగా పాడయ్యాయి. దీంతో సాగునీరు అందక రైతులు చెరకు పంటను మానుకున్నారు. గత ఏడాది 9,472 హెక్టార్లలో పండించగా, ఈ ఏడాది అది 6,468 హెక్టార్లకు పడిపోయింది. అంటే దాదాపు 3 వేల హెక్టార్లు తగ్గుముఖం పట్టింది. చెరకు సాగు తగ్గడానికి మరో కారణం జిల్లాలో ప్రధానమైన భీమసింగి, సీతానగరం ఎన్‌సీఎస్ షుగర్ ఫ్యాక్టరీలు మూతపడడం. వైసీపీ ప్రభుత్వం వాటిని కనీసం తెరిపించే ప్రయత్నం కూడా చేయలేదు. రైతులకు కోట్ల రూపాయలు బకాయిలు నిలిచిపోవడంతో చివరకు ఎన్‌సీఎస్ షుగర్స్ భూములను వేలం వేసి చెల్లింపులు చేయాల్సిన దౌర్భాగ్య స్థితికి వైసీపీ సర్కారు చేరుకుంది. అటు సహకార వ్యవస్థలో నడుస్తున్న భీమసింగి షుగర్స్‌ది కూడా అదే పరిస్థితి. ఆధునికీకరణ పేరు చెప్పి ఆ పరిశ్రమను వైసీపీ సర్కారు మూసివేసింది. దీంతో జిల్లాలో ప్రైవేటు యాజమాన్యంలో నడుస్తున్న రేగిడి మండలంలోనిసంకిలి చక్కెర పరిశ్రమ రైతులకు దిక్కయ్యింది. జిల్లా నలుమూలల నుంచి రైతులు అతి కష్టమ్మీద సంకిలి ఫ్యాక్టరీకి చెరకు తరలించి విక్రయించుకోవాల్సి వస్తోంది.

దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం..

జిల్లాలో చెరకు సాగు విస్తీర్ణ పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. జిల్లా నలుమూలల నుంచి సంకిలి ఫ్యాక్టరీకి చెరకు తేవడం కష్టమని గుర్తించిన (మిగతా 8వ పేజీలో..)





ధనుర్మాసోత్సవాలు ఆరంభం

● ఆలయాల్లో పూజలు ● గ్రామాల్లో మేలుకొలుపులు ● గోదాదేవి అమ్మవారికి ప్రీతికరం

గ్రామాల్లో నెలరోజులు పాటు సందడిగా నిర్వహించే ధనుర్మాసోత్సవాలు సోమవారం ఆరంభమయ్యాయి. జిల్లాలోని శ్రీరామ, విష్ణు, వేంకటేశ్వ తదితర ఆలయాల్లో ఈ వేడుకులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా గోదా రంగనాథ స్వాములకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లో హరికథ సంకీర్తనలు, మేలుకొలుపుల భజనలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

సాలూరు రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సాలూరులో పెదకోమటిపేట రామాలయం, కల్యాణ వేంకటేశ్వర ఆలయాల్లో ధనుర్మాస పూజలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. రామాలయంలో నిర్వహించిన ధనుర్మాస వత్ర పూజల్లో మంత్రి సంధ్యారాణి, జయకుమార్ దంపతులు పాల్గొన్నారు. వారి వివాహ వార్షికోత్సవం కావడంతో రుత్వికులు ప్రత్యేక పూజ చేశారు.

● బొబ్బిలి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి వేణుగోపాలస్వామి, కంచరవీధి కల్యాణ వేంకటేశ్వరస్వామి, సింగారపువీధి వైభవ వేంకటేశ్వర స్వామి, స్వామివారి వీధి ఆలయాల్లో సోమవారం వేకువ జామున ధనుర్మాస పూజా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారికి బేడాసేవ, విశేష కైంకర్యాలు నిర్వహించారు. భక్తులు కోలాటం, భజనలు చేశారు. విష్ణుసహస్ర నామ పారాయణం గావించారు.



బొబ్బిలి రూరల్: పెంట రామమందిరంలో హారతి

● బొబ్బిలి రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట, గున్నతోటవలస గ్రామాల్లో సోమవారం ధనుర్మాసం పర్వదినాలను స్వాగతించేందుకుగాను సామూహిక హారతి నిర్వహించారు.

● రాజాం రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజాంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక తెలగ వీధిలోని వేంకటేశ్వర దేవాలయంలో ప్రధాన అర్చకులు వాసు ఆధ్వర్యంలో, రాణావీధిలోని ఆండాళ్ (విష్ణు) కోవెలలో అర్చకులు రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

● శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎస్.కోటలో వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవి ఆలయంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

తోటపల్లిలో..

గరుగుబిల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తోట పల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు మొదటి రోజు సోమవారం ఆలయ అర్చకుడు వీవీ అప్పలాచార్యులు పాసురాన్ని పఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గరుగుబిల్లి: పూజలందుకుంటున్న తోటపల్లి వేంకటేశ్వరస్వామి



తిరుప్పావై పై ఉపన్యాసం చేస్తున్న నరసింహాచార్యులు

రామదేవుడి సన్నిధిలో..

నెల్లిమర్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 13న భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదాదేవి అమ్మవారికి జరుగునున్న కల్యాణంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల ప్రారంభ సూచికగా దేవస్థానం తూర్పు గోపురం వద్ద నెల గంటను ఏర్పాటు చేశారు. స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు తిరుప్పావై పై ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివునికి రుద్రాభిషేకం

సాలూరు రూరల్/పాచిపెంట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలం తాడూరు గ్రామంలోని శివాలయంలో శివలింగానికి సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. తాడూరు గ్రామంలో ఒక రైతు భూమి దున్నుతుండగా దశాబ్దాల కిందట బయటపడడంతో దీనిని స్వయంభూ శివలింగంగా భక్తులు విశ్వసిస్తారు. నిలువు నామాల శివునిగా ప్రతీతి పొందిన ఈ శివలింగానికి ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రుద్రాభిషేకం చేస్తున్న రుత్వికులు



సాలూరు రూరల్: పూజల్లో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి దంపతులు



ఎస్.కోట రూరల్: ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



బొబ్బిలి: సింగారపు వీధి ఆలయంలో స్వామివారికి బేడాసేవ

దివ్యాంగ పింఛన్ ఇప్పించండి

● పక్షవాతం రోగి శివుడు వినతి ● కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత

బెలగాం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'నాకు పక్షవాతం వచ్చి 13 ఏళ్లు కావస్తోంది. పూర్తిగా కాళ్లు, చేయి పడిపోయాయి. ముగ్గురు మనుషులు ఉంటే గానీ కాలకృత్యాలకు వెళ్లలేని దుస్థితిలో ఉన్నాను. ఇప్పటివరకూ తనకు వృద్ధాప్య పింఛన్ మాత్రమే ఇస్తున్నారు. దాన్ని దివ్యాంగ పింఛన్‌గా మార్చాల'ని పార్వతీపురం మండలం బాలగొడబకు చెందిన శేకరాబిల్లి శివుడు ఏకరవుపెట్టారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివుడు మాట్లాడుతూ అనారోగ్యం వల్ల మందులకు అధిక మొత్తంలో ఖర్చువుతోందన్నారు. పూర్తిస్థాయిలో దివ్యాంగుడైన తనకు సదరం సర్టిఫికేట్‌లో 50 శాతం ఉన్నట్టు మాత్రమే నమోదు చేశారన్నారు. దాంతో తనకు వృద్ధాప్య పింఛన్ మాత్రమే వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నానన్నారు. ఇదే విషయం పలుమార్లు అధికారులు తెలియజేశానని, ఇకనైనా తనకు రూ.15 వేలు దివ్యాంగ పింఛన్ మంజూరయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు.



శివుడిని ఎత్తుకుని వస్తున్న కుటుంబ సభ్యులు

పాడి పరిశ్రమకు మంచి రోజులు



● రైతులకు సర్కారు ఆసరా

● ఆడ పెయ్యిల సంతతి పెంపునకు తోడ్పాటు

● రాయితీపై ఇంజెక్షన్లతో సత్ఫలితాలు

గజపతినగరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పూర్వకాలం నుంచి పశు పోషణ రైతుకు కొండంత ఆసరాగా ఉంటోంది. సాగులో ఒడుదుడుకులు ఎదురయ్యేటప్పుడు భరోసాగా నిలుస్తోంది. ఆ పరిశ్రమకు మరింత తోడ్పాటు అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గేదె, ఆవు దూడ సంతతి పెంపునకు చర్యలు చేపట్టింది. వాటి సంతానోత్పత్తి పెంచేందుకు ఇంజెక్షన్‌లను రాయితీపై ఇస్తోంది.

జిల్లాలో చాలామంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పశువులకు యద రావడానికి సూడి కట్టడానికి రైతులు ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారు. పశువుల ఆసుపత్రికి వెళితే సాధారణ గర్భధారణ ఇంజెక్షన్ చేయడానికి రూ.40 చెల్లించాలి. అది నిలబడుతుందో లేదో తెలియని పరిస్థితి. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం పాడిరైతు ఆదాయాన్ని పెంచేందుకు నూతన విధానాలను అమలులోకి తీసుకువచ్చింది. కేవలం పాడిరైతుల గేదెలు, ఆవులకు ఆడపెయ్యలు మాత్రమే పుట్టేలా చర్యలు చేపట్టింది. పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖల ద్వారా సెక్స్‌సార్టెడ్ సెమన్ డోసులు పంపిణీ చేస్తోంది. ఈ డోసు వేసిన పశువులకు దాదాపు 90 శాతం ఆడ దూడలే పుట్టే అవకాశం ఉంది.

పాడిరైతులకు పాల ఉత్పత్తి పెంచి అదనపు ఆదాయాన్ని సమకూర్చడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇటీవల నిర్వహించిన పశుగణన ప్రకారం జిల్లాలో గేదెలు 97,845, ఆవులు 3,77,960 ఉన్నట్లు గుర్తించారు.



సెమన్‌తో పుట్టిన లేగదూడకు చుక్కల మందు వేస్తున్న వైద్యాధికారులు

రూ.500లకే రెండు డోసులు..

పశువులకు సెక్స్‌సార్టెడ్ సెమన్ 2 డోసులు ఇవ్వాల్సి ఉంటుంది. పశువుల గర్భంలోకి గన్ ద్వారా సెమన్ నేరుగా పంపుతారు. మొదటి డోస్ ఇచ్చిన 21 రోజులు తర్వాత రెండో డోస్ కూడా వేస్తారు. ఈ రెండు డోస్‌ల విలువ రూ.1350 కాగా రైతులకు రూ.850 సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోంది. రైతులు కేవలం రూ.500 మాత్రమే చెల్లించాల్సి ఉంది. పశువులకు రెండు డోస్‌లు ఇచ్చిన తరువాత అవి గర్భం దాల్చకుంటే రైతుల నుంచి తీసుకున్న రూ.500 నేరుగా రైతులకే అందజేస్తారు. ఒక వేళ ఆడ దూడ కాకుండా మగ దూడ పుడితే సంబంధిత రైతుకు రూ.250 తిరిగి చెల్లిస్తారు. రైతుకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే రాయితీపై ఈపథకాన్ని అందజేస్తోంది. జిల్లాలో ఇంతవరకు సుమారు 12 వేలకు పైబడే డోసులు ఇచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి గేదెలు, ఆవులకు పశుసంవర్థక శాఖ అధికారులు, సిబ్బంది డోసులు వేశారు. దీనిలో 90 శాతానికి పైగా అనుకూల ఫలితాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామాల్లో రైతులకు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ అవగాహన కల్పిస్తున్నారు.



ఆడ పెయ్యి జననం

అధికారుల సూచనల మేరకు మా గేదెకు నేను సెక్స్‌సార్టెడ్ సెమన్ రెండు డోసులు వేయించాను. సూడి వచ్చింది. ఎటువంటి ఇబ్బంది లేదు. నెలక్రితం ఆడ పెయ్యి పుట్టింది. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉంది.

- కర్రి సన్యాసిరావు, పాడిరైతు, పాతబగ్గాం

రైతు ఆదాయం పెంచడమే లక్ష్యం



పాడి రైతులకు అదనపు ఆదాయం పెంచడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ సెమెన్‌తో 90 శాతం పశువులకు ఆడ పెయ్యలు పుట్టే అవకాశం ఉంది. ప్రతిచోటా ఇప్పటివరకు మంచి ఫలితాలు వస్తున్నాయి. రైతులకు ఈపథకంపై అవగాహన కల్పిస్తున్నాం.

- ఎన్.చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, గజపతినగరం

తొలగించిన ఆయాను

విధుల్లోకి తీసుకోవాలి

● కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తొలగించిన హెల్పర్ (ఆయా) సౌజన్యను విధుల్లోకి తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు చెప్పిన మాటలు విని ఆయాను విధులు నుంచి తొలగించడం అన్యాయమని మండిపడ్డారు. అన్ని అర్హతలు ఉన్నాయని ఉద్యోగం ఇచ్చిన ఐసీడీఎస్ అధికారులు.. ఇప్పుడు అర్హతలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులు పాల్పడడం సరికాదన్నారు. అక్కడ నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇంటికి ర్యాలీగా వెళ్లే సమయంలో పూలే విగ్రహం వద్ద డీఎస్పీ తన సిబ్బందితో అడ్డుకున్నారు. మంత్రి స్థానికంగా లేరని ఐసీడీఎస్ పీడీని తీసుకుని వస్తామని చెప్పడంతో అక్కడ నుంచి తిరిగి కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పీడీ శాంతికుమారి అక్కడ వచ్చి కొంతమంది నాయకులను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ వద్ద తీసుకువెళ్లి మాట్లాడించారు. దీని స్పందించిన కలెక్టర్ జేసీతో విచారణ చేయిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉమామహేశ్వరి, వి.లక్ష్మి, పైడి రాజు, అనసూయ, సురేష్, టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భారీ కొండచిలువ

● చంపావతి నదిలో వలకు చిక్కిన వైనం

● అటవీ ప్రాంతంలో విడిచిపెట్టిన చేపల వేటగాళ్లు

గజపతినగరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పురిటిపెంట పంచాయతీ పరిధి షరాబుల కాలనీకి ఆనుకుని చంపావతి నదిలో సోమవారం చేపల వేటకు వెళ్లినవారికి పెద్ద కొండ చిలువ చిక్కింది. చేపల కోసం నదిలో వల వేయగా.. సుమారు 16 అడుగుల కొండ చిలువ పడింది. దీంతో ఆ కొండ చిలువను వల నుంచి తప్పించి సుదూర ప్రాంతంలో విడిచి పెట్టారు. కాగా ఈ భారీ కొండ చిలువను చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యల తరలిచ్చారు.



చేపల వలకు చిక్కిన భారీ కొండ చిలువ

చివరి తడి అందక..

బామిని, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వాతావరణం అనుకూలించక వరి పైరుకు రెండు తడులు నీరందక తీవ్రంగా నష్టపోయామని వడ్డంగి తదితర ప్రాంతాల రైతులు ఆవేదన చెందుతున్నారు. పొట్టదశ నుంచే చెరువుల్లో నీరు చేరకపోవడం వర్షాలు కురవకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని వాపోతున్నారు. వడ్డంగిలోని గజపతి సాగరానికి ఈ ఖరీఫ్‌లో నీరు చేరకపోవడంతో కిటికిరాయి చెరువు, ఊర చెరువు ఆయకట్టు కింద 300 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. ప్రస్తుతం యంత్రాలతో కోస్తే మదుపులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నూర్పిడి చేయగా 50 శాతం మాత్రమే పంట దక్కిందని బూరాడ కన్నయ్య అనే రైతు తెలిపారు. కౌలు ఇచ్చేందుకు కూడా ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.



ఎండిపోయిన వరి చేను

న్యూస్ బాక్స్

నేడు వాహనాల వేలం

విజయనగరం క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నటు సీఐ టీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు వేలం పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

అభినందనీయం

రాజాం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలలో కూటమి అభ్యర్థులు పూర్తి స్థాయిలో విజయం సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. జి.సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయ సోమవారం రాజాం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆయనను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, నాయకులు టంకాల మౌళీశ్వ రరావు, వీవీ గోపాలరావు, మక్క నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు లావణ్య



లావణ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గరివిడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 25 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్య పట్టణంలో జరగనున్న 68వ ఆల్ ఇండియా ఖోఖో పోటీలలో తాండ్రంగి పాఠశాలకు చెందిన చనమల లావణ్య మన రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని హెచ్ఎం కడలి రమేష్ కుమార్, పీడీ సత్యనారాయణ తెలిపారు. గతనెల 3, 4, 5 తేదీల్లో అనకాపల్లి పట్టణంలో జరిగిన రాష్ట్ర పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. ఈ బాలిక ఎంపిక పట్ల పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

ఆరోపణలు సరికాదు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ హెల్పర్ మానాపురపు సౌజన్య తొలగింపుతో తమకు ఎటువంటి సంబంధం లేదని, దీనిపై సీఐటీయూ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని గజపతినగరం మండలం రామన్నపేట సర్పంచ్ రుంకాణ అరుణ తెలిపారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

చర్యలు తప్పవు

రామన్నపేట అంగన్‌వాడీ హెల్పర్ మానాపురం సౌజన్య స్థానికురాలు కాదంటూ ఆగస్టు 13న ఫిర్యాదు అందిందని ఐసీడీఎస్ పీడీ శాంతి కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగం పొంది ఉండటం వల్ల ఆమెను విధుల నుంచి తొలగించినట్టు వివరించారు. ఈ విషయం కోర్టులో ఉందని.. అంగన్‌వాడీ కార్యకర్తలు విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రక్తదానంతో మేలు

గజపతినగరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి రక్తదానం చేయడంతో ఆరోగ్యవంతమైన జీవితం కొనసాగించవచ్చునని గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ అన్నారు. సోమవారం స్థానిక సాయి సిద్ధార్థ కళాశాల ఆవరణలో రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యనిర్వాహక సభ్యులు చుక్కా సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వోసీలు మంజూరు చేయండి

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట మండల కేంద్రంలోని జగన్న కాలనీ లబ్ధిదారులు తమ ఇళ్లపై బ్యాంకు రుణాలు తెచ్చుకోవడానికి ఎన్‌వోసీలు మంజూరు చేయాలని జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు. ఈ విషయంపై సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్‌కు వినతిపత్రం ఇచ్చారు. రుణాల కోసం వెళ్తున్న సమయంలో బ్యాంకు వారు ఎన్‌వోసీలు అడుగుతున్నారని తెలిపారు. వీటిని వెంటనే ఇచ్చే ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చంటి, మోపాడ చిన్ని, నాని పాల్గొన్నారు.

ఘనంగా మినీ క్రిస్మస్

గరివిడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గరివిడిలో గల చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది.

ఆర్‌ఓ ప్లాంట్ వితరణ

రాజాం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆర్వో ప్లాంట్, 10 ప్లాస్టిక్ కుర్చీలు అందించినట్టు రోటరీ క్లబ్ కార్యదర్శి గట్టి పాపారావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ టౌన్ అధ్యక్షుడు కృష్ణారావు, రామారావు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను సరిచేయండి

చీపురుపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వే తప్పిదాలను సరి చేసి, రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు విజ్ఞప్తి చేశారు. పేరిపిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల తరఫున అధికారులకు వినతిపత్రం అందజేశారు. పేరిపి పరిధిలో సుమారు 350 ఎకరాలు 22ఏలో నమోదయ్యాయన్నారు. దీనిలో చిన్న కమతాలు కలిగి ఉన్న పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. బాధితుల్లో తాను కూడా ఉన్నానన్నారు. గతంలో పని చేసిన అధికారులు, సిబ్బంది లంచాలకు కక్కుర్తిపడి రికార్డుల్లో తప్పులు నమోదు చేశారని ఆయన ఆరోపించారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎటువంటి చర్యలు లేవన్నారు. ఈ సదస్సులో పెద్ద చెరువు సంఘం అధ్యక్షుడు ఎలకల అప్పారావునాయుడు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, తహశీల్దారు నమ్మి రాజారావు, నోడల్ అధికారి హేమసుందరరావు, సబ్ రిజిస్ట్రార్ పీవీకేఎస్ లక్ష్మణరావు, ఆర్ఐ డి.రామ్‌కుమార్, తెలుగుదేశం నాయకులు మోపాడ తేజేశ్వరరావు, కోరాడ కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే లలితకుమారి తదితరులు

భూ సమస్యల పరిష్కారానికే..

లక్కవరపుకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం ఎల్.కోట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. గత ప్రభుత్వం రీసర్వే పేరుతో చేసిన మోసాల నుంచి రైతులను విముక్తి చేయడానికి చంద్రబాబు నాయుడు రెవెన్యూ సదస్సులు పెట్టారని తెలిపారు. ఈ సదస్సుల ద్వారా భూ సమస్యలు తీరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాదరావు, డీటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గద్దే బాబూరావు

సదస్సులు ఎందుకు?

డెంకాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎంపీపీ బి.వాసుదేవరావు తదితరులు తహసీల్దారు పద్మావతి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎంపీపీ మాట్లాడుతూ రీ సర్వే పక్కాగా నిర్వహించాలని కోరారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములు, చెరువులు, రస్తాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, టీడీపీ జనసేన పార్టీ నాయకులు పాణిరాజు, ప్రదీప్‌రాజు, రొంగలి కనకసింహాచలం, సిరికి అప్పారావు, రొంగలి వెంకటరావు పాల్గొన్నారు.

'మీకోసం'లో 143 వినతులు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం)లో వివిధ సమస్యలపై 143 వినతులు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూకు సంబంధించి 98, పంచాయితీరాజ్‌కు 13, గ్రామ వార్డు సచివాలయ శాఖకు, డీఆర్‌డీఏకు 6, మున్సిపల్, విద్యుత్ శాఖకు 6, గృహ నిర్మాణానికి సంబంధించి 3 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి స్వీకరించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

వినతులు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం తన తండ్రికి కేటాయించిన 40 సెంట్ల భూమిని వేరొకరు ఆక్రమించుకున్నారని గజపతినగరం మండలం ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన టి.నానాజీ కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని కోరారు.

- ఎస్‌కోట మండలం ధర్మవరం గ్రామంలో ఎంపీ నిధులతో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని కొందరు కబ్జా చేశారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- ఆస్తులు ఉన్నా... తమ కుమారుడు విక్రయించకుండా అడ్డుపడుతున్నాడని.. చివరికి తినడానికి తిండి లేక ఆకలితో ఇబ్బంది పడుతున్నామని బొండపల్లి మండలం ముద్దూరు గ్రామానికి చెందిన కొవ్వాడ అప్పారావు, కళావతి దంపతులు విన్నవించారు. వృద్ధులమైన తమకు పని చేయడాని అవకాశం లేదని, రేషన్ కార్డు లేదని తెలిపారు. ఆకలితో అవస్థలు పడుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.
- తమ పిల్లలు 90 శాతం అంగవైకల్యంతో బాధ పడుతున్నారని... ప్రభుత్వం నెలకు రూ.ఆరు వేల పింఛను ఇస్తోందని... ఈమొత్తాన్ని పెంచాలని కాకల యశ్వంత్ , దూసి చక్రధర్, చింతాడ నవీన్ కుమార్‌ల తల్లిదండ్రులు కోరారు.
- పిల్లలను, తనను విడిచిపెట్టి తన భర్త మూడో పెళ్లి చేసుకోవడాకి సిద్ధ పడుతున్నారని విజయనగరం పట్టణం వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఎం.స్వాతి ఫిర్యాదు చేశారు. ఆయన పట్టణంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారని తెలిపారు. విచారణ చేపట్టి.. న్యాయం చేయాలని కోరారు.
- ధాన్యం సేకరణలో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని రైతు సంఘ నాయకులు బి.రాంబాబు కోరారు. బస్తాపై అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని వివరించారు. దీనిపై విచారణ చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్‌ను కలిసిన కలెక్టర్

షెడ్యూల్ కులాల వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాను జెడ్పీ అతిథిగృహం వద్ద సోమవారం రాత్రి కలెక్టర్ అంబేడ్కర్ కలిశారు. ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రంజాన్ మిశ్రాతో సమావేశమై జిల్లా పరిస్థితిని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాస్ మూర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, సాంఘిక సంక్షేమ అధికారి రామానందం తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని.. అందులో భాగంగా ముమ్మరంగా రోడ్ల నిర్మాణం జరుగుతోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఎస్.కోట రామ్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీనివాసకాలనీలో శ్రీకుసుమహర ఆలయంలో ధర్మకర్త గాడి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న త్రయాహం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ నాయుడు, రాయవరపు చంద్రశేఖర్, వెంకన్న, చెక్క కిరణ్, కోణదం మల్లేశ్వరరావు, కాపుగంటి వాసు, బాలభరత్, సూర్యారావు, మోపాడ చిన్నికృష్ణ, మోపాడ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు నిధులు

నియోజకవర్గంలో వసతి గృహాల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.80లక్షలు విడుదల చేసిందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించిన కూటమి ప్రభుత్వానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. లక్కవరపుకోట, కొత్తవలస, వియ్యంపేట వసతి గృహాల మరమ్మతులకు ఈ నిధులు వెచ్చించనున్నట్టు తెలిపారు.

క్షయ రహిత రాష్ట్రంగా ఏపీ

లక్కవరపుకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్షయ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే లలితకుమారి పిలుపునిచ్చారు. సోమవారం పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. క్షయ నివారణ చర్యల కోసం భారత ప్రభుత్వం వంద రోజుల కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. అవగాహన ద్వారా క్షయ నివారణ సాధ్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ, తహసీల్దార్ ప్రసాదరావు, వైద్యులు బి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అవగాహన అవసరం

బొండపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరని నోడల్ అధికారి ఎస్‌ఏ.బాషా సూచించారు. ముద్దూరులో సోమవారం క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.రాము, సర్పంచ్ మునకాల పైడిపునాయుడు, మాజీ సర్పంచ్ కె.నారాయణరావు, రాధ, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బహుళ పంటలు లాభదాయకం

కొత్తవలస, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా బహుళ పంటలను వేసుకోవడం వల్ల అధిక ఆదాయం ఆర్జించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టీం లీడర్ ప్రకాష్, టెక్నికల్ అధికారి హేమసుందర్ తెలిపారు. దీంతో పాటు పంటకు ఆశించే చీడపీడలను నివారించుకోవచ్చునని సూచించారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ బృంద సభ్యులు స్థానిక గొల్లపాలెం గ్రామంలో వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుళ పంటల వల్ల నేలకు కావలసిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి సిబ్బంది కోటిబాబు, శ్యామల, ఉషశ్రావ్య, దేముడ్మ రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

భోగాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలంటే రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ ఎన్వీ ప్రభాకర్ అన్నారు. స్థానిక పోలీసే స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చలికాలం కావడంతో పొగమంచు అధికంగా ఉంటుందని దీని కారణంగా వాహనాలు సక్రమంగా కనిపించవని తెలిపారు. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. వాహన దారులు పరిమిత వేగంతో ప్రయాణించాలని సూచించారు. కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు.



సీఐ ఎన్వీ ప్రభాకర్

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలి

గరివిడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పిలుపునిచ్చారు. గరివిడిలో గల పశువైద్య కళాశాలలో సోమవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ఎం.శ్రీను, సీఐ జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించండి



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న అమ్మినాయుడు

జామి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లల్లో నైపుణ్యాలను పెంపొందించాలని రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డాక్టర్ ఎన్.అమ్మినాయుడు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన జామి ఏబీనగర్ ఎంపీపీ పాఠశాలలోని భవిత సెంటర్‌ను సందర్శించారు. బోధన తీరును పరిశీలించారు. ప్రభుత్వ సౌకర్యాలు ఎలా అందుతున్నాయో పరిశీలించారు. ఫిజియోథెరపీ జరుగుతున్న తీరును చూశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత సమన్వయకర్త సూర్యారావు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు విశాఖపట్టణం జిల్లా పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన అయితి అప్పలనాయుడుకు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలానికి చెందిన బాలిక నగరంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో అయితి అప్పలనాయుడికి పరిచయం ఏర్పడింది. నిందితుడు బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆటోలో వేర్వేరు ప్రాంతాలకు తీసుకువెళ్లి పలుమార్లు శారీరకంగా అనుభవించినట్టు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ పి.వీరాంజనేయ రెడ్డి నిందితుడిని అరెస్టు చేసి.. కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ పత్రాలు సమర్పించారు. నిందితుడు అప్పలనాయుడు మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టు నేరం రుజువైంది. దీంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించినట్టు తెలిపారు. త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

సీసీ కెమెరాలతో బ్యాగు గుర్తింపు

రాజాం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచిపోయిన బ్యాగును సీసీ ఫుటేజీల ఆధారంగా రాజాం పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. బ్యాగుతో పాటు అందులో ఉన్న రూ.32 వేల నగదు, విలువైన డాక్యుమెంట్లను సంబంధిత వ్యక్తికి అప్పగించారు. రాజాం సి.ఐ. అశోక్‌కుమార్ అందజేసిన సమాచారం ప్రకారం.. పట్టణంలోని అమ్మవారి కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆర్నిపల్లి వెంకటనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి విశాఖ వెళ్లేందుకు పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవాలయం సమీపంలో సోమవారం ఉదయం ఆటో ఎక్కారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆటో దిగిన వెంకట నాయుడు బ్యాగును అందులోనే మరచిపోయారు. కాసేపటి తరువాత బ్యాగు ఆటోలో మరచిపోయినట్లు నిర్ధారించుకుని రాజాం పోలీసులను ఆశ్రయించారు. మెయిన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న సీసీకెమెరాలను పరిశీలించి ఆటోను గుర్తించారు. ఆటోలో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికుడు బ్యాగు మరచిపోయిన విషయం ఆటో డ్రైవర్ కూడా గమనించలేదని తెలుస్తోంది.

గాయపడిన వృద్ధురాలి మృతి

గంట్యాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకోవడంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న పెంట శ్రీరాంపురం గ్రామానికి చెందిన అడపా నారాయణమ్మ(68) మృతి చెందారు. దీనికి సంబంధించి ఎస్ఐ సాయి కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14న నారాయణమ్మ గ్యాస్ స్టౌపై మరుగుతున్న టీ గిన్నెను చీర కొంగుతో కిందకు దించే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో చీరకు నిప్పంటుకోవడంతో వేడిగా మరిగిన టీ ఆమె శరీరంపై పడటం వల్ల తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే ఆమెను 108 వాహనంపై చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం డబ్బులు ఇప్పించండి

గంట్యాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిల్లర్ నుంచి తమకు ధాన్యం బకాయి డబ్బులు ఇప్పించాలని మురపాకలోని సూర్యరాజు రైసు మిల్లు వద్ద వసంత, రావివలస, లక్కిడాం, తదితర గ్రామాల రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. 2020-21లో రైసు మిల్లుకు ధాన్యం ఇచ్చామని, మిల్లరు నుంచి రూ.75 లక్షలు పైబడి రావలసి ఉందని తెలిపారు. వాటిని ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతులతో పాటు మహిళలు మిల్లు వద్ద బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎస్ఐ సాయి కృష్ణ మిల్లు వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. ఈ సమస్యపై ఇరువర్గాలతో మాట్లాడుతున్నామని, సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ మూర్తి, రైతు సంఘ నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

వేతనాలు చెల్లించాలి

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బకాయి ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు సుధారాణి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 12 నెలల వేతనాలు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.3 లక్షలు ఇవ్వాలని కోరారు. 9,10 తరగతులకు పిల్లల సంఖ్య ఆధారంగా వర్కర్లును పెంచాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చల్ల ఎర్రయ్యమ్మ, ఆర్.దేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, వాచ్‌మెన్‌కు ఈ ఏడాది జూలై నుంచి వేతనాలు బకాయిలు ఉన్నాయని... వెంటనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ 300 మంది విద్యార్థులకు ఒకే ఆయా ఉండటంతో పని భారం పెరుగుతోందని తెలిపారు. ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో సెప్టిక్ ట్యాంక్

రాజాం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లికార్జునకాలనీ ఏడో లైన్ సమీపంలో ఓ ఆర్టీసీ ఉద్యోగి ప్రభుత్వ స్థలంలో సెప్టిక్‌ట్యాంక్ నిర్మాణం చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాత ఇంటిని రీమోడలింగ్ చేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ స్థలంలోనే ట్యాంక్ నిర్మాణం చేపడుతున్న విషయమై కాలనీకి చెందిన కొంతమంది మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పనులు నిలిపివేయాలని నిర్మాణదారుడిని మున్సిపల్ సిబ్బంది ఆదేశించారు. అయినప్పటికీ ఆయన సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఇదే విషయాన్ని రాజాం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారికి ఆదేశిస్తానని స్పష్టం చేశారు.



ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంక్

చేదెక్కిన చెరకు

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 15 మండలాల్లో 13 చోట్ల తూనిక యంత్రాలను కూడా అందుబాటులోకి తెచ్చింది. రవాణా చార్జీలను సైతం చెల్లించే ఏర్పాట్లు చేస్తోంది. ఇంకోవైపు ప్రోత్సాహకాలు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించేందుకు కూడా ప్రయత్నాలు మొదలుపెట్టింది. వ్యవసాయ శాఖ అధికారులు సైతం రైతులను కలిసి చెరకు సాగు చేయాలని ప్రోత్సహిస్తున్నారు. సాగు సలహాలు అందిస్తున్నారు.

కష్టమే మిగులుతోంది..

చెరకు రైతులకు కష్టాలే మిగులుతున్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. సాగులో శ్రమ అధికం. మిగిలేది చాలా తక్కువ. పైగా పంట విక్రయించుకునేందుకు కనీస సదుపాయాలు లేవు. గత ఐదేళ్లలో అయితే దారుణ పరిస్థితులు ఎదుర్కొన్నాం. వైసీపీ హయాంలో మూతపడిన చక్కెర పరిశ్రమలను తెరిపించాలి.

- శిమ్మ జగన్నాథం, రైతు, రాజాం

గడ్డు పరిస్థితులు..

గతంలో ఎన్నడూ లేని గడ్డు పరిస్థితులను గత ఐదేళ్లలో ఎదుర్కొన్నాం. జిల్లాలో రెండు షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. సంకిలి పరిశ్రమపై ఒత్తిడి పెరిగింది. దీంతో చెరకు కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ ఏడాది ముందస్తుగా 13 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం శుభ పరిణామం.

- బెవర శ్రీనివాసరావు, రైతు, కొప్పరకొత్తవలస, వంగర

13 కేంద్రాలు ఏర్పాటు చేశాం

జిల్లాలో సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలించే ఏర్పాట్లు చేశాం. జిల్లా వ్యాప్తంగా 13 చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. రైతులు చెరకు కేంద్రాలకు తరలించి విక్రయించుకోవచ్చు. ఇప్పటికే మద్దతు ధర ప్రకటించాం. రైతులకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తాం.

- సత్యనారాయణ, డిప్యూటీ కేన్ కమిషనర్

బోడికొండ రోడ్డు పనులు వేగవంతం చేయాలి

- నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి



పూసపాటిరేగ: సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

నెల్లిమర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానం పక్కనే ఉన్న నీలాచలం (బోడి కొండ) కొండ చుట్టూ రూ.2 కోట్లతో మంజూరైన తారు రోడ్డు నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. ఈ రోడ్డు పనులను ఆమె సోమవారం పరిశీలించారు. కాంట్రాక్టర్‌తోనూ, ఇంజినీరింగ్ అధికారులతోనూ మాట్లాడారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న గిరి ప్రదక్షిణ సమయానికి రోడ్డు పనులు పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, ఎడ్ల గోవిందరావు, గదల అచ్చింనాయుడు, ఎంఎం నాయుడు, నవుగట్ల పైడిరాజు, ఎల్లంకి హరి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

పూసపాటిరేగ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పతివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ కార్యాలయాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల విడుదలకు కృషి చేస్తా

పూసపాటిరేగ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిప్పలవలస గ్రామానికి చెందిన 9 మంది మత్స్యకారులు గతనెల 22న చేపలవేటకు వెళ్లగా... ఒడిశా తీరంలో కోస్టుగార్డులు నిర్బంధించారని ఎమ్మెల్యే లోకం నాగమాధవికి స్థానికులు సోమవారం తెలిపారు. నాటి నుంచి మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఆమె స్పందిస్తూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ అధికారులు, నాయకులతో చర్చించి వారి విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బోటులో తిప్పలవలస గ్రామానికి చెందిన పిల్లి మసలయ్య, మల్లి చిన్నప్పన్న, మల్లి పెద్ద అప్పన్న, కేశం చిన్న ఎర్రయ్య కారి గురువులు, కేశం సందోడు, కారి గురునాథ్, గురప్ప, రాయితి అమ్మోరు ఉన్నారు.

సైనికుడి కుటుంబానికి సాయం

నెల్లిమర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేటలో సీఆర్పీఎఫ్ జవాన్ కాళ్ల మోహనరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆ గ్రామానికి చెందిన సైనికులు, మాజీ సైనికులు కలిసి రూ.30 వేలు సమకూర్చి సోమవారం ఆయన కుటుంబీకులకు అందజేశారు.

అంగన్‌వాడీల ఆందోళన



ఐసీడీఎస్ పీవోకి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొత్తవలస, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాల పరిధిలో గల అంగన్‌వాడీ కార్యకర్తలు వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. గౌరవ వేతనం పెంచాలని, కార్యకర్తలకు అర్హతలను బట్టి పదోన్నతి కలించాలని డిమాండ్ చేశారు. మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని కోరారు. ఈ మేరకు ప్రాజెక్ట్ అధికారిణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిత, సీపీఐ నాయకుడు డేగల అప్పలరాజు, ప్రాజెక్ట్ కార్యదర్శి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

రామభద్రపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొట్టక్కి గ్రామంలో భూఆక్రమణకు పాల్పడిన టొంపలి నాగరాజు, వారి కుటుంబీకులపై చర్యలు తీసుకుని, ఆ భూమిని స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. కొట్టక్కి గ్రామంలో సోమవారం తహసీల్దార్ ఆకుల సులోచనారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సుమారు 30 ఎకరాల డీపట్టా భూమిని బీనామీ పేర్లతో కబ్జా చేశారని ఆరోపించారు. గతంలో ఈ భూమిని 65 మంది పేదలకు ఒక ఎకరా చొప్పున పంపిణీ చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. వీటిలో కొంతమంది ప్రభుత్వ భూమిని సాగుచేస్తున్నా పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. అలాగే కొట్టక్కి గ్రామంలో ఎస్సీ కుటుంబాలకు శాశ్వతమైన శ్మశానం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శ్మశానవాటికకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని గ్రామానికి చెందిన పలువురు కోరారు.

నిరసనల హోరు

కలెక్టరేట్ వద్ద సమస్యల పరిష్కారంపై కార్మికులు, ఉద్యోగులు ఆందోళన

జెలగాం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం కలెక్టరేట్ సోమవారం నిరసనలతో హోరెత్తింది. వివిధ ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, సంఘాల నాయకులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేపట్టారు. ● జిల్లాలోని పలు కేజీబీవీల్లో డైలీవేజ్ కింద పనిచేసిన వర్కర్లు తమను అకారంగా విధుల్లోంచి తొలగించారని కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ● పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆయాలు నిరసన తెలిపారు. ● పార్వతీపురం పట్టణంలో ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఫుట్‌పాట్, తోపుడు బళ్ల వ్యాపారులు పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సంక్రాంతి వరకు తమకు సమయం ఇచ్చి, తర్వాత ఎక్కడ చెబితే అక్కడ బళ్లు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటామని చెప్పారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన చిరువ్యాపారులు

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

- కలెక్టర్ శ్యాంప్రసాద్



అధ్యాపకులతో మాట్లాడుతున్న కలెక్టర్

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీ మోడల్ పాలిటెక్నిక్ కళాశాలను కలెక్టర్ శ్యాంప్రసాద్ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం లైబ్రరీలో కాంపిటేటీవ్ పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. పాలిటెక్నిక్‌లో ఉన్న కోర్సులు, వారి అవసరాలను అధ్యాపకులకు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సిగరెట్ బేళ్లు సీజ్

బొబ్బిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి బొబ్బిలి పట్టణానికి అక్రమంగా రవాణా చేస్తున్న ఆరు సిగరెట్ బేళ్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాద్‌కు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారి బి.రామారావు, సిబ్బంది పి.లక్ష్మీనారాయణ, ఐ.ఈశ్వరరావులు సిగరెట్ బేళ్లను పట్టుకున్నారు. పట్టణానికి చెందిన ఇంకుల రమేష్ అలియాస్ రాయగడ రమేష్ అనే వ్యాపారి ఎటువంటి ఇన్వాయిస్ బిల్లులు లేకుండా సిగరెట్ బేళ్లను రవాణా చేస్తుండడంతో వాటిని సీజ్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం జీఎస్టీ అధికారులకు అప్పగించినట్టు విజిలెన్స్ అధికారి రామారావు తెలిపారు. ఈ సిగరెట్ల విలువను జీఎస్టీ అధికారులే నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

ధనుర్మాస నగర కీర్తనలు ప్రారంభం

పాలకొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఏటా నిర్వహించే నగర సంకీర్తనలను నాగవంశం వీధి భక్తులు సోమవారం ప్రారంభించారు. మొదటిగా శ్రీకోటదుర్గమ్మ వారిని దర్శించుకొని అక్కడ నుంచి నగర సంకీర్తనలు ప్రారంభించారు. అలాగే ఆంజనేయనగర్‌లోని శివాలయంలో శ్రీమద్ భాగవత సప్తాహః గీతాపారాయణాన్ని ప్రారంభించారు.



నగర సంకీర్తన ప్రారంభిస్తున్న దృశ్యం

తాగునీటి కష్టాలు

- సీసీ రోడ్డు పనుల్లో భాగంగా తెగిన పైపులైన్
- 40రోజులుగా ఇబ్బంది పడుతున్న సీఎస్ఆర్‌పేట వాసులు

వీరఘట్టం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిదిమి పంచాయతీ సీఎస్ఆర్‌పేట గ్రామస్థులు గత 40 రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పనుల్లో భాగంగా యంత్రాలతో మట్టిని తవ్వినప్పుడు రక్షిత ట్యాంకుకు వచ్చే పైపు తెగిపోయింది. దీంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. గ్రామంలో ఒకే బావి ఉంది. ఈ బావిలో తక్కువ నీరు ఉండడంతో గ్రామంలోని ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. దీంతో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని, తాగునీరు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



సీఎస్ఆర్‌పేట రక్షిత తాగునీటి పథకం

మరమ్మతులు చేపడతాం

ఈ విషయం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కావ్యశ్రీ మాట్లాడుతూ సిమెంట్ రోడ్డు పనుల్లో భాగంగా పైపులైన్ పాడైన మాట వాస్తవమే అన్నారు. త్వరలో మరమ్మతులు చేపట్టి తాగునీరు అందేలా చూస్తామన్నారు.

సొంత సమస్యగా భావించి పరిష్కరించండి: జేసీ



వినతులు స్వీకరిస్తున్న జేసీ శోభిక

పార్వతీపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను తమ సొంత సమస్యగా భావించి పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని జేసీ ఎస్ఎస్ శోభిక అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఇందులో 133 మంది అర్జీదారులు తమ వినతులను జేసీకి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి ఎస్.మన్మథరావు, ఎల్‌డీఎం జేఎల్ఎన్ మూర్తి, జిల్లా బీసీ సంక్షేమాధికారి కృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు. ● పాచిపెంట మండలం కోటికిపెంట గ్రామానికి చెందిన పెద్దగడ్డ ప్రాజెక్టు నిర్వాసితులు తమ సమస్యలను పరిష్కరించాలని జేసీ శోభికకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సోమవారం వారు విలేకర్లతో మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా తాము అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని, తమ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్‌కు 43 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏపీవో చిన్నబాబు

సీతంపేట రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 43 వినతులు వచ్చాయి. హౌసింగ్ బిల్లు మంజూరు చేయాలని బురికిపేట గ్రామానికి చెందిన ఎల్.కరువమ్మ కోరగా, పొజీషన్ సర్టిఫికేట్ ఇప్పించాలని ఎగ్రమానుగూడ గ్రామానికి చెందిన సవర శ్రీరాములు కోరారు. బంధమానుగూడ గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని సవర మీన, మేకల రుణం ఇప్పించాలని గురవం దొర ఏపీవో చిన్నబాబును కోరారు. అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారి పనులు పూర్తి చేయాలని రేగిడి గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. పీజీఆర్ఎస్‌లో డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మదుసూధనరావు, పీహెచ్‌వో వెంకటగణేష్, ఐకేపీ ఏపీడీ సన్యాసినాయుడు, ఏఎంవో కోటిబాబు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రూ.160 కోట్ల రుణాలు లక్ష్యం

- స్త్రీనిధి జిల్లా మేనేజర్ రమేష్

రామభద్రపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి పథకం కింద జిల్లాలో రూ.160 కోట్లు రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్త్రీనిధి జిల్లా మేనేజర్ కె.రమేష్ తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటివరకు రూ.131 కోట్ల 4లక్షలను 16వేల 937మంది మహిళలకు రుణాలుగా అందించామని తెలిపారు. మిగతా లక్ష్యాన్ని వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రికవరీ శాతం 98 శాతంపైబడి ఉందన్నారు. రామభద్రపు రం, దత్తిరా జేరు, మెంటా డ, గజపతిన గరం, బొబ్బిలి, బాడంగి క్లష్టర్ పరిధిలో ఉన్న మండలాల్లో స్త్రీనిధి పథకం కింద 5వేల 600 మంది డ్వాక్రా మహిళలకు రూ.32 కోట్ల 75లక్షల రుణాలు అందించామని తెలిపారు. అలాగే స్త్రీనిధి పథకంలో భాగస్వాములైన మహిళలకు సురక్ష ద్వారా బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. రెండు సంవత్సరాల కాల పరిమితిలో రుణం తీసుకున్న మహిళ మరణిస్తే అప్పటికు న్న మొత్తాన్ని మాఫీ చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీఎం కోట్ల అన్నపూర్ణ, సీసీలు బాలకృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ



సీతంపేట రూరల్: ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఏపీవో చిన్నబాబు



సాలూరు రూరల్: టెన్నిస్ వాలీబాల్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఆర్చరీలో సత్తా చాటారు

సీతంపేట రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వన వాసీ కల్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో పాడేరు డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో దోనుబాయి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎ.కిరణ్, సవర సూర్యం ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. టీం చాంపియన్‌షిప్‌ను కూడా సాధించారు. ఈనెల 24న ఛత్తీస్‌ఘడ్‌లో నిర్వహించబోయే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఏపీవో జి.చిన్నబాబు సోమవారం అభినందించారు. డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో నారాయుడు, హెచ్ఎం సుకుమార్, పీఈటీలు ఆర్సీ రెడ్డి, దిలీప్, వెంకట్రావు ఉన్నారు.

టెన్నిస్ వాలీబాల్‌లో..

సాలూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా గోపన్నపాలెంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ వాలీబాల్ పోటీల్లో బొడ్డవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. జూనియర్ విభాగంలో అభికి బంగారు పతకం, యశ్వంత్, వాసులకు వెండి పతకం లభించినట్టు చెప్పారు. వారిని జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, పీఈటీ నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సంవత్సరాంతం గడువు సమీపిసున్న నేపథ్యంలో మున్సిపాల్టీ పరిధిలో అన్ని రకాల పన్నుల వసూలు లక్ష్యాలను కచ్చితంగా అధిగమించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆమె సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పట్టణంలో పన్నుల వసూలు ప్రక్రియ మందకొడిగా ఉన్నందున ఇంకా జోరందుకోవాల్సి ఉందన్నారు. ఇంటి పన్నులు, కొళాయి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా నిర్వహించిన ఈ సమీక్షలో పన్నుల డిమాండ్‌కు-వసూలుకు వ్యత్యాసం ఉందని గుర్తించారు. ప్రత్యేక వసూలు డ్రైవ్ నిర్వహించాలని, రోజువారీ వసూలు లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. మున్సిపల్‌కార్యాలయం సిబ్బందితో కలిపి టీములను ఏర్పాటు చేసుకొని ప్రత్యేక కలెక్షన్ డ్రైవ్‌నిర్వహించాలని ఆదేశించారు. రోజువారీగా పన్నుల వసూళ్ల తీరును పర్యవేక్షించాలని రెవిన్యూ అధికారులను ఆదేశిస్తూ కమీషనరు మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌ఓ నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగ పరిరక్షణకు కృషి చేస్తా

బొబ్బిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో పేరుకుపో యిన అనేక రకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాం ధ్ర పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. సోమవారం ఆమె బొబ్బిలిలో తన ఎన్నికల ప్రణాళికకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు ద్వారా శాసన మండలికి పంపితే అందరి ఆశయాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో సేవలందిస్తాన ని కోరారు. యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, సత్యనారాయణ, ఆనెం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మావుడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న చింతలవలస ఫీడర్, మామిడిపల్లి- మావుడి ఫీడర్‌లో మంగళ, బుధవారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పార్వతీపురం విద్యుత్‌శాఖ ఈఈ కె.గోపాలరావునాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రీఫేజ్ సప్లయి ఉదయం నాలుగు గంటల నుంచి పది గంటల వరకు ఉంటుందన్నారు.

ఇండ్ గ్యాప్ ధాన్యం విక్రయం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారాడ గ్రామంలో ఇండ్ గ్యాప్ (ఇండియా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్) పద్ధతులకు అనుగుణంగా పండించిన ధాన్యాన్ని ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ సోమవారం లేబిలింగ్, బ్రాండింగ్‌తో వినియోగదారులకు విక్రయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం పండించిన పంటకు మద్దతు ధర కంటే అధికంగా రైతుకి ధర లభించే అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ విధంగా పండించిన ధాన్యం క్వింటా రూ.2,800 చొప్పున వినియోగదారులకు అమ్ముతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మూడడ్ల సంతోషి పాల్గొన్నారు.

క్యాబేజీ ధరల పతనం

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కూరగాయల బజారులో సోమవారం వివిధ గ్రామాల నుంచి క్యాబేజీ పువ్వులు విపరీతంగా వచ్చి చేరాయి. సుమారు 60 కేజీలున్న క్యాబేజీ బస్తా కేవలం రూ.300 పలకగా 10 నుంచి 12 పువ్వులున్న బాస్కెట్ రూ.60 మాత్రమే పలికింది. ఎకరా సాగు చేసిన రైతులకు ఈసారి కనీసం రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు నష్టం వచ్చిందని రైతులు చెబుతున్నారు. గత సంవత్సరం పువ్వు కనీసం రూ.10 నుంచి రూ.15 వరకు ధర పలికిందని, ఈ సారి కూలీలకు వెచ్చించిన డబ్బులు కూడా రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జనసేన ఉనికిని చాటుకున్నాం

బొబ్బిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీ ఉనికిని చాటుకున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రతినిధులను ఆయన సన్మానించారు. జనసేన నాయకులు అడబాల నాగు, పొండ్రంకి అప్పారావు, పైల హరిప్రసాద్, జమ్ము గణేశ్, వీర మహిళలు లక్ష్మి, ఉష, రామలక్ష్మి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

సీతానగరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జోగింపేట గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ నల్ల సూర్యనారాయణకు బ్రెయిన్ సర్జరీ జరగాల్సి ఉంది. ఈయనకు శ్రీసుబ్బమ్మ తల్లి పేరంటాలు సేవా సంఘం తరుపున రూ.20 వేలు సాయం అందజేసినట్టు ఆ సంఘ అధ్యక్షుడు టంకల శ్రీనివాసరావు, పాల వరప్రసాద్, ఎం.తాతబాబు తెలిపారు.

'బుడితి'కి ప్రకృతి సేద్య అవార్డు

సీతానగరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కె.వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు బుడితి మోహనరావుకు ప్రకృతి సేద్య అవార్డు వరించింది. ఈయన గత మూడేళ్లుగా దేశీ విత్తనాలతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అందుకు గాను విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన ఆర్గానిక్ మేళాలో ప్రకృతి సేద్య అవార్డుతో సన్మానించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు యూనిట్ ఇన్‌చార్జి ఎస్.గంగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

గరుగుబిల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి శ్రీవిశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధ్వజ స్తంభం ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ ధ్వజ స్తంభానికి తోటపల్లికి చెందిన ఆవాల కన్నయ్య, సింహాచలం దంపతులు ఇత్తడి తాపడంను వేయించారు. వీరితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు